# మోక్షాన్ని మంటబెడదాం

- నాసరయ్య



సిరిపురంలో వ్యవసాయ కూలీలు ఎక్కువగా నివ సించే ప్రాంతంలో ఒక చిన్న పూరిపాక. అందులో ఇద్దరు పిల్లల్తో నాగయ్య నాగమ్మల అతిపేదకుటుంబం. సూర్యో దయ మయింది. నిద్రలేచిన నాగయ్య మోకాళ్ల మీద తలబెట్టి దిగాలువడి కూర్చున్నాడు. నాగమ్మ యిల్లుబయట వూడ్చి కళ్లాపి చల్లి ముగ్గుపెట్టి ఇంట్లోకి వచ్చింది. "అమ్మా ఆకలే" అంటు పిల్లలు నీరసంగా కేకలు పెట్టారు.

"దేనికని సావ మంటారే నన్ను. మేమిద్దరం ఎద్దులకి మల్లె శాకిరి చేత్తానేవుండాం. అయినా పొట్టకింత కూడు దొరకటమే కట్టమై పోతంది. తవ్వెడునూకలు బదులన్న దొరుకుతయ్యేమో పోయొత్తా" అంటు బయటకు నడిచింది.

దబ్బపండు చాయతో కండలు తిరిగి నిగనిగ లాడుతున్న శరీరంతో మెడలో జందెము ముఖాన విభూతిరేఖలతో చేతిలో తళతళలాడు చెంబుతో నాగయ్య ఇంటిముందుకు వచ్చి "భవతీ భిక్షాందేహి" అంటు అరిచాడొక బాపనయ్య. ఆకేకతో తలపైకెత్తి చూచి గబగబ బయటకు వచ్చాడు నాగయ్య. చేతులు జోడించి "దండాలు సామీ దండాలు" అన్నాడు. సామీ మాయింటో మీకు పెట్టేందుకు ఏమీ లేవు. మా ఆడది నూకల కుండెప్పుడూ తుడి సెయ్యదు. ఏమన్నావుండయ్యేమో తెత్తానుండండి అంటూ లోనికెళ్లి కుండ అడుగునవున్న అరసోలెడు బియ్యాన్ని అయ్యా ఆకలే అంటున్న పిల్లని కాదని బాపనాయన చెంబులో పోశాడు. "దీర్ఘాయుష్మాన్‌భవ" అంటూ బాపనాయన వెళ్లిపోయాడు. పిల్లలు గుడ్లప్పగించి చూస్తున్నారు.

సోలెడు నూకలు చెంగులో చుట్టుకొని వచ్చింది నాగమ్మ. "అమ్మా! అయ్య కుండలో వుండ బియ్యమన్ని బాపనోడి సెంబులో పోశాడే" అని చెప్పారు. ఆ మాట వినంగానే నాగమ్మ నడుములు విరిగినట్టు కూలబడింది. శోకాలు పెడుతూ "ఆకలాకలని అల్లాడతన్న పిల్లలు కనపడలేదం టయ్యా? నువ్వసలు మడిసివేనా? ఆ పిల్లల్ని నన్ను గొంతుపిసికి సంపి ఏ పాడుబడ్డ బావిలోనో పడేసిరా. పీడ వొదిలిపోద్ది. శోకాలు పెడుతోంది.

"ఆరుసోములోరే. ఆరికి పెడితే పున్నెమొత్తాదే" అన్నాడు. "యేందీ? ఆరు సోములోరా? ఆరికి బెడితే పున్నెమొత్తదా? ఓరు సెప్పారయ్యా నీకీ కబుర్లు? ఇయ్యన్నీ మన శాకిరినంత దోసుకుంటున్న ఆ బూసాములు. పనీపాట సెయ్యకుండ సోమరిపోతు

లుగా తిరిగే ఆ బాపనయ్యలాంటోళ్ళు సెబుతున్న మోసపు మాటలయ్యా అయ్యి. ఆలు సేత్తన్న మోసాన్ని మనం తెలుసుకుంటే ఎక్కడ తిరగబడి ఆల్లని తంతావోనని పావమని కరమని గీతలని చెబుతున్నారు. నుప్పుమీద నీల్లు సల్లినట్లు మన కోపాన్ని సల్లార్చటానికి ఈ మోసపు కూతలు కూత్తన్నారు." శోకాలు పెడుతూనే చెప్పింది.

"యేందే నువు సెప్పేదంతా నిజమేనంటె?"

"అవునయ్యా అచ్చురాల నిజం. కట్టం సేసేటోల్లం వందమందిముంటె సోమరిపోతోల్లు పదిమంది గూడ వుండరు. ఆ పదిమంది వందమంది మీద పెత్తనం సేత్తన్నారు. ఆల్ల శాకిరిని దోసుకు తింటన్నారు. అదేమని అంటే ఎన్నోరకాలుగా యింసలు పెడతన్నారు. కాల్సుకు తింటన్నారు.

అవునె నువ్వు సెబుతున్నదంత జరుగుతానె వుందిగదే. "పనీపాటాలేనోలు శానా కుట్రలు సేశారు. ఆల్లముందు మనకి సదువు సందెలు లేకుండ సేశారు. తరవాత మన్ని గురించి మనం ఆలోసిచ్చుకునే తీరికలేకుండ ఎప్పుడూ శాకిరితో ఆకలితో తన్నుకులాడతావుండేట్టు సేశారు. అసలు మోసం మన దరిద్రానికి బాధలకు ఆల్లు సేత్తన్న దోపిడిగాదు. మనకర్మ, మన రాతలు పాపాలు కారణాలని సెప్పారు. యీటన్నింటిని మన మనసుల నిండా కుక్కి వాటన్నింటిని నమ్మేట్టు సేశారు. ఆటిని నమ్మి మనశాకిరి మనకి కావాలని పోట్టాటం మానేసి ఆ పదిమందికి సేవలు సేత్తన్నాము.

నిజమేనే నువు సెబుతున్నదంత జరుగుతున్నదే గందే. నువు సిన్నప్పుడు సదువుకున్నావు. మన నాయకులిత్తన్న బొక్కులు సదువుతున్నావు సంగ మీటింగులకి ఎల్లొత్తన్నావు. అందుకే నీకిన్ని మంచి సంగతులు తెలుత్తావుండయ్యి. అది సరే జనములు పాపం పున్నెం కరమరాతలు అన్నీ ఆ దేముడే గదా పెట్టింది. ఆటినెట్టా కాదంటాము?"

సూడయ్యా బూసామి బుజంగం కూటికిలేని దరిద్దుర్లు పండిచ్చుకుంటున్న పదెకరాల బంజరు భూమిని నాదేనని ఆక్రమిచ్చుకొని ఆల్ల కడుపు కొట్టాడా! ఇది నాయమేనా? దీనిని దేముడె యిచ్చాడా? సెప్పయ్యా సెప్పు? ఇది పెద్ద అన్నాయమేగదా. దీన్ని నాకుదేముడిచ్చాడంటాడు నమ్ముతావా? నిజంగాదేముడనేవాడుంటె ఇప్పుడు ఇన్ని అన్నాయాలెందుకు జరుగుతుంటయ్యి అయన్ని వట్టి మాటలు ఈ సోమరిపోతోల్లు మతం పేరుతోటి దేవుడి పేరుతోటి ఈ అన్నాయాలన్నింటిని నాయాలుగా పెశారం సేత్తన్నారు. ఈటిని మన మనసుల నిండా కుక్కుతున్నారు. ఇవన్నీ నిజమనుకొని మనం సతమతమవుతున్నాం.

"మరిప్పుడు మనమేం సెయ్యాలంటావే?"

"ముందు మన మనసులలో పేరుకుపోయిన యీ బురదనంతా ఈ మవుడ్డాన్నంతా బయటికి లాగేసుకోవాలి. అది మల్లా బతికి పైకి రాకుండు మాడ్సి మసి సేసెయ్యాలఅప్పుడు బూసాములు సేత్తన దోపిడి, సూడయ్యా బూసాముల సేలల్లో దుక్కిదున్నిన దగ్గిర్నుండి నూర్సి గింజలు ఆల్లకొంపలికి తోలిందాక శాకిరంత మనది. ఆ గింజలన్ని అమ్ముకొని కట్టలన్ని బీరువాల్లోనూ, బ్యాంకుల్లోను దాసుకుంటున్నారు. ఇంత శాకిరి సేసిన మనకి ఆకలితీరేంత కూలన్న యిత్తన్నారా? యియ్యటల్లేదు. ఇది అన్నాయం. ఇది అన్నాయం అని తెలిత్తె మన గుండెలు మండిపోతయ్యి. మన నరాలు పొంగిపోతయ్యి. అంతేనా? కాదా?!!

"అంతే. అప్పుడు మన పిడికిళ్లు బిగుసుకుంటయ్యి. మన గొంతులు పిగులుతయ్యి. ఒరేయ్ అంటూ కేకబడతాం. అడుగుముందుకేత్తాం అప్పుడే మనం సెయ్యాల్సిన పోట్టాట మొదలవుద్ది.

"బలేగా సెప్పావయ్యా యీవూపు మనలో రాకుండ సెయ్యటానికి వాళ్లు యీమత మవుడాన్ని నింపుతున్నారు. దీన్ని కాల్సి మసి సెయ్యడమె ముందు మనం సెయ్యాల్సిన పని.

"అవునె మనం అడుగు ముందుకేత్తే ఆపేవోడెవడే? సర్లే పిల్లలు ఆకలాకలంటున్నారు. నేనవసరంగా పిల్లల నోటికాడిగింజలు ఆడిమొగాన పోశా. యియ్యన్న తొందరగా వొండి ఆ పిల్లలకు పెట్టు. నేనొండుతాగాని నీవు రెండు పుల్లలెత్తుకురా... అంటూ పొయివద్దకు నాగమ్మ, నాగయ్య బయటకు నడిచారు.

★